దశాబ్దాల కల సాకారం

- అంతర్గత రహదారుల అభివృద్ధి
- అందుబాటులోకి తాగునీటి వసతులు
- పేదలకు ప్రత్యామ్నాయ పాకల నిర్మాణం
- వసతుల కల్పనలో కంకిపాడు పంచాయతీ


కంకిపాడు పాశం లక్ష్మణస్వామి నగర్‌లో నిర్మించిన సిమెంటు రోడ్డు

కంకిపాడు: ఏడాది కాదు..రెండేళ్లు కాదు....నాలుగు దశాబ్దాల నాటి సమస్య. ఇన్నాళ్లు ఆ ప్రాంత వాసులు కనీస మౌలిక వసతులు ఎరుగరు. అంతర్గత రహదారుల అభివృద్ధి ఊసే లేదు. తాగునీటికి సైతం గుంపులుగా నీటి కుళాయిల వద్ద పడిగాపులు పడ్డ పరిస్థితులు. ఈ సమస్యలన్నింటికీ కంకిపాడు పంచాయతీ పాలకవర్గం తెరదించింది. ఆ ప్రాంతంలో ఉన్న అంతర్గత రహదారులు అన్నింటినీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది. వీధి వీధికీ తాగునీటి కుళాయిలను సమకూర్చింది. కనీస మౌలిక వసతులు సమకూరటంతో పాశం లక్ష్మణ స్వామి నగర్ వాసుల్లో ఆనందం నెలకొంది. కంకిపాడు పంచాయతీలో ఓ మూలన విసిరేసినట్లు ఉండే ప్రాంతం పాశం లక్ష్మణస్వామి నగర్. కంకిపాడు లాకులు నుంచి బొడ్డపాడు రోడ్డు మార్గంలో కాలువ కట్ట వెంబడి విస్తరించి ఉంటుంది. ఈ ప్రాంతంలో సుమారు 350 పైగా కుటుంబాల ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రధానంగా సంచార జీవనం సాగించే కుటుంబీకులు ఇక్కడ ఎక్కువ. కంకిపాడు–వల్లూరుపాలెం రోడ్డే వీరికి ప్రధాన రహదారి మార్గం. ఇది కూడా కోతకు గురై, చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచి, బురదకయ్యగా మారిన అంతర్గత రోడ్ల మీదుగానే ఇక్కడి ప్రజలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. ఏళ్ల తరబడి ఇదే సాగుతుంది. ఇక తాగునీటి విషయానికొస్తే ఈ కుటుంబాలన్నింటికీ మూడు, నాలుగు మించి నీటి కుళాయిలు లేవు. ఇరిగేషన్ కట్ట కావటంతో మౌలిక వసతుల కల్పనకు గత పాలకులు చొరవ చూపని పరిస్థితి.

వేగంగా మౌలిక వసతుల కల్పన.....

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ మద్దతుతో పంచాయతీలో పాలకవర్గం ఏర్పాటైంది. ఈ ప్రాంతంలో 12 అంతర్గత రహదారులు పూర్తి స్థాయిలో సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు. గ్రామ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18 లక్షలు రోడ్ల అభివృద్ధికి వెచ్చించారు. అన్ని రహదారుల వద్దకూ తాగునీటి పైపులైనును విస్తరించారు. రూ.2 లక్షలు అంచనా వ్యయంతో ఆయా రోడ్ల మొదట్లో తాగునీటి కుళాయిలను ఏర్పాటుచేశారు. పాశం లక్ష్మణస్వామి నగర్ వరకూ తాగునీరు సమృద్ధిగా సరఫరా అయ్యేందుకు, పట్టణ ప్రజలకు మెరుగైన రీతిలో తాగునీటిని సరఫరా చేసేందుకు పులి రామారావు నగర్ వద్ద రూ.2 లక్షలుతో బోరు ఏర్పాటు చేసి పైపులైన్లను అనుసంధానం చేయటంతో తాగునీరు సమృద్ధిగా ఈ ప్రాంతానికి చేరుతోంది.

18 కుటుంబాలకు పాకల ఏర్పాటు....

లాకులు ప్రాంతంలో సచివాలయ భవన నిర్మాణానికి ఆటంకంగా ఉన్న 18 పాకలను తొలగించి లక్ష్మణ స్వామినగర్‌లో పునరావాసం కల్పించారు. ఈ 18 మందికి గొడవర్రు కేంద్రంగా ఏర్పాటవుతున్న జగనన్న లే అవుట్‌లో ఇళ్లస్థలాలను కేటాయించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే వరకూ తాత్కాలింగా పాకలను నిర్మించుకుని నివాసం ఉండేందుకు రాచూరి ఫౌండేషన్ ద్వారా రూ.1 లక్ష వెచ్చించి పాకల నిర్మాణానికి చేయూత అందించటం గమనార్హం.

వసతులు మెరుగుపడ్డాయి



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ఈ ప్రాంతంలోనే ఉంటున్నాం. మెయిన్ రోడ్డు తప్ప, మిగిలిన రోడ్లు అన్నీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. నీటి కోసం ఇబ్బందులు పడే వాళ్లం. ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా పని కాలేదు. ఈ ప్రభుత్వం, కంకిపాడు పంచాయతీ వసతులు కల్పించింది. రోడ్లు వేసింది. ప్రతి రోడ్డు దగ్గరా ట్యాప్ వేశారు. నీటికి ఇబ్బందులు లేవు. ఆనందంగా అనిపిస్తుంది.

– కె.సుబ్బారావు, స్థానికుడు

ప్రతి రోడ్డూ అభివృద్ధి చేశారు



గుడివాడ ప్రాంతం నుంచి 25 ఏళ్ల క్రితం ఇక్కడికి వలస వచ్చాము. ఇక్కడే పాకలు వేసుకుని జీవిస్తున్నాం. అప్పటి నుంచి రోడ్లు వేయలేదు. బురద నీటిలో నడవటమే తెలుసు. ఇన్నాళ్లకు రోడ్లు పడ్డాయి. ఈ ప్రాంతంలో ప్రతి రోడ్డూ అభివృద్ధి చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– గరికె దుర్గ, స్థానికురాలు

సమగ్ర అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి చేస్తామని ప్రజలకు చెప్పాం. మమ్మల్ని నమ్మి అత్యధిక శాతం స్థానాలను గెలిపించి అధికారం ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి సమస్యనూ గుర్తించాం. ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాం. నాణ్యతలో రాజీపడటం లేదు. దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాల కోసం పాలకవర్గం పాటుపడుతుంది.

– రాచూరి చిరంజీవి, జగనన్న సచివాలయాల చైర్మన్, కంకిపాడు

జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి


పునాదిపాడు-2 సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకిపాడు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని పునాదిపాడు-2 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. సచివాలయం పరిధిలోని పునాదిపాడు, గొల్లగూడెం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై రూపొందించిన సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. గొల్లగూడెం గ్రామ పంచాయతీ ప్రాంగణం వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పునాదిపాడు సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, గొల్లగూడెం సర్పంచ్ నత్తా దుర్గాభవాని, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఈఓ బి.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వనాబత్తిన ఆంజనేయులు, దాసరి జార్జి, గంటా మార్తమ్మ కూరపాటి సుధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డ్రైవర్ జీవనోపాధికి ఆటో మంజూరు


మహిళా ఆటో డ్రైవర్ జస్వంతకు ఆటో అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కుటుంబ పోషణ భారంగా మారటంతో భర్తకు చేదోడువాదోడుగా ఉండేందుకు ఆటో డ్రైవర్‌గా మారిన దళిత మహిళకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. బాపులపాడు మండలం కె.సీతారామపురానికి చెందిన చట్టుమాల జస్వంతకు స్త్రీశక్తి పథకం కింద ఆటో పంపిణీ చేశారు. ప్రభుత్వం వడ్డీ లేని రుణం రూ.3,10,000 మంజూరు చేయటంతో కొనుగోలు చేసిన ఆటోను ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. జీవనోపాధి నిమత్తం ఆటో డ్రైవర్‌గా రేయింబగళ్లు కష్టపడుతున్న భర్త మోషేకు సహకరించాలనే ఉద్దేశంతో ఆటో నేర్చుకుని, లైసెన్స్ పొందినట్టు జస్వంత చెప్పింది. ఆటో కొనుగోలు చేసేందుకు రుణం కోసం దరఖాస్తు చేయటంతో వడ్డీ లేకుండా రూ.3,10,000 మంజూరు చేశారని, దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆమె తెలియజేసింది. ప్రతి పేదవాడికి పెద్దన్నగా సీఎం వైఎస్ జగన్ నిలబడుతున్నారని జస్వంత చెప్పారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు


సంగీత కచేరి నిర్వహిస్తున్న సుధీర్‌శర్మ

విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్ స్వరఝరి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసుడు కొరిడే సుధీర్‌శర్మ పలు వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్ జనార్దన్, మృదంగంపై బీఎస్ ప్రశాంత్, కంజీరాపై శ్రీకాంత్ సహకరించారు. సుధీర్‌శర్మ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. స్వరఝరి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వాహకులు సుధీర్‌శర్మను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా జగనన్న

డీసీఎంఎస్ చైర్ పర్సన్ స్నిగ్ధ


కానూరులో గీజర్లు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు జగనన్న అండగా ఉండి పారదర్శక పాలన అందిస్తున్నారని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. రక్ష ఫౌండేస్ ఆధ్వర్యంలో కానూరు సిద్దిక్ నగర్‌లోని మదర్సాకు రూ.50 వేలు విలువ చేసే గీజర్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా జగనన్న కృషి చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి పేద కుటుంబాల ఉన్నతికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, విద్యా, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని అన్నారు. కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ సోహైల్ అక్తర్, సభ్యులు హఫీజ్ ఇబ్రహీం, హమీద్, డైరెక్టర్ ఖాదర్ వహాబ్ హనూరియాజ్ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

హరిహరసుతయే శరణమయ్యప్ప

- గొల్లపూడి అయ్యప్ప సన్నిధిలో మార్మోగుతున్న శరణుఘోష
- మాలధారులకు రెండు నెలలు అన్నదానం


గొల్లపూడిలోని అయ్యప్ప స్వామి దేవాలయం


మాలధారణ చేస్తున్న శ్రీనాథ్ నంబూద్రి (ఫైల్)


మాలధారిణికు పండ్లు పంపిణీ చేస్తున్న భక్తురాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వామియే శరణమయ్యప్ప.. హరిహర సుతయే శరణమయ్యప్ప అంటూ విజయవాడ రూరల్‌లోని గొల్లపూడి అయ్యప్పస్వామి ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి. దీన్ని 1969లో అయ్యప్ప స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేచనానంద చేతుల మీదుగా ప్రారంభమైంది. శబరిమలలో ఆలయ నమూనాలోనే గొల్లపూడిలో నిర్మించారు. ఇక్కడ కేరళలోని నంబూద్రి బ్రాహ్మణులతో పూజాదికాలు నిర్వహిస్తున్నారు. శబరిమలలో జ్యోతి దర్శన సమయంలో ఇక్కడ కూడా కర్పూర జ్యోతితో స్వామి భక్తులకు దర్శనమిస్తారు. శబరిమలలో మాదిరిగా కాకుండా ఇక్కడ స్త్రీలకుకూడా దేవాలయ ప్రవేశం ఉండటం విశేషం.

భక్తిశ్రద్ధలతో

కార్తిక మాసంలో పలువురు భక్తులు అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తారు. గొల్లపూడి అయ్యప్ప దేవాలయంలో గత నెల 17న ధ్వజారోహణ మహోత్సవం ప్రారంభమైంది. ఇందులో భాగంగానే మండల పూజలు మొదలయ్యాయి. అదే రోజు ఆలయానికి అనుబంధంగా ఉన్న భవనంలో మాలధారులకు ప్రారంభమైన అన్నదానం సంక్రాంతి పండుగ వరకు కొనసాగుతుంది. ఇందులో అయ్యప్ప, భవానీ, శివ మాలధారులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. స్వాములతోపాటు వచ్చేవారికి నామమాత్రపు చార్జీలు తీసుకుని అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

ఏటా సుమారు 40 వేల మంది మాలాధారణ

గొల్లపూడి అయ్యప్ప దేవాలయంలోఏటా సుమారు 40 వేల మంది భక్తులు మాలాధారణ చేస్తుంటారు. రోజుకు వెయ్యి నుంచి 1500 మంది వరకు మాలాధారణ చేస్తుండగా ఇప్పటికి సుమారు 25వేల మంది మాలధారణ చేసుకున్నారని ఆలయ పూజారులలో ఒకరైన శ్రీనాథ్ నంబూద్రి తెలిపారు. ఈ ఏడాది తొలిసారిగా మాలధారణ (కన్నె స్వాములు) చేసుకునేవారు ఎక్కువ కావడం, అందులో ఆడపిల్లలు ఉండటం విశేషం. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది బృందాలు, బృందాలుగా శబరిమల ప్రయాణమవుతున్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం

దుర్గగుడి ఈఓ రామారావు


యాగశాల వద్ద ఉభయదాతల వివరాలను పరిశీలిస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించాలని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై ప్రసాదం కౌంటర్లు, మల్లేశ్వరాలయ పనులను ఈవో రామారావు శనివారం పరిశీలించారు. తొలుత సర్వ దర్శనం, రూ.100, రూ.300 క్యూలైన్లను పరిశీలించారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా క్యూలైన్లు ముందుకు నడపాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని ప్రసాదం కౌంటర్లను తనిఖీ చేసిన ఈవో రామారావు భక్తులతో మాట్లాడారు. ప్రసాదం త్వరితగతిన భక్తులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టే కౌంటర్‌లో ఈవో రామారావు భక్తులతో మాట్లాడారు. కొబ్బరి కాయలు తమ చేతుల్లో నుంచి తీసుకుని సిబ్బందే కొట్టేస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఉభయదాతల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయం చుట్టూ రాతి మండపం పనులు వేగంగా పూర్తవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏఈవో ఎన్. రమేష్‌బాబు, ఏఈ లక్ష్మణ్, పాల్గొన్నారు.

17న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా మహాసభ


వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఒగ్గు గవాస్కర్, సాయిరాం

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ నగరంలోని ఐవీ ప్యాలెస్ నందు ఈ నెల 17న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఎన్టీఆర్ జిల్లా మహాసభ జరుగనున్నట్లు జోనల్ కోఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సాయిరాం తెలిపారు. గవర్నర్‌పేట కోర్టుల భవనం బీబీఏ హాల్ వద్ద మహాసభల వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లా మహాసభలను న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిళ్లా రవి, మన్మధరావు, సూరిబాబు, చిన్నం రామకృష్ణ, చంద్రమౌళి, చావలి అబ్రహాంలింకన్, కళ్యాణ్, వైవీ సీహెచ్ రాజశేఖర్, రాజేష్, సౌమ్య, ఉషాజ్యోతి, ప్రభాకర్, నాగిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న స్వాముల నిత్య అన్నదానం



గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్వాములకు నిత్య అన్నదాన నిర్వహిస్తున్నారు. సురేష్ స్వామి నేతృత్వంలో దాతల సహకారంతో గత 15 రోజులుగా అన్నదానం కొనసాగుతోంది. ప్రతి రోజు 300 నుంచి 400 మంది అయ్యప్ప స్వామి, భవానీలు, శివ, గోవిందస్వామి మాల ధరించిన స్వాములకు అన్నదానం చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సురేష్‌స్వామి తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమానికి సహకారం అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఫ్యాకల్టీ శిక్షణ



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగిసింది. ఈ నెల 4వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శిక్షణను ప్రారంభించారు. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు వారం రోజుల పాటు లార్జ్ స్కేల్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ డిజైన్ సాంకేతిక పురోగతిపై శిక్షణ ఇచ్చారు. డిజైన్ టూల్స్, అనలాక్ డిజైన్, భద్రత, ప్రాజెక్టులు వివిధ అంశాలపై ప్రొఫెసర్లు వివరించారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, డీన్‌లు రావి సత్యప్రసాద్, ఏ. సుధీర్‌బాబు, డీవీవీ.శ్రీకాంత్, ఎం.వంశీకృష్ణ, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుంది



విజయవాడ కల్చరల్: సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కవిసంధి వినూత్న సాహిత్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కవులు సాహిత్యంతో పరిచయం చేసుకోవాలని ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలని సూచించారు. పుట్టమచ్చ కవి ఖాదర్‌మోహిద్దీన్ గురించి మాట్లాడుతూ సమకాలీనమైన అంశాలు ఆయన కవిత్వంలో కనిపిస్తాయని చెప్పారు. కవి ఖాదర్‌మోహిద్దీన్ తాను రచించిన పుట్టమచ్చ కవితా సంపుటిలోని కవిత్వాన్ని వినిపించారు. నేడు కవిత్వంలో వస్తున్న మార్పులు, వస్తువు, రచనా సంవిధానం అంశంగా కవులు ఆయనతో ముఖాముఖి చర్చించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కవులు కవిసంధి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేయూ బాక్సింగ్ పోటీల్లో కేబీఎన్ ఓవరాల్ చాంప్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించినట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల జరిగిన బాక్సింగ్ పోటీల్లో మహిళ విభాగంలో ఒకరు పురుషుల విభాగంలో ఐదుగురు పాల్గొనగా వెళ్లిన క్రీడాకారులు పతకాలు సాధించారని తెలిపారు. తమ కళాశాల మహిళా బాక్సర్ రక్షిత ఉత్తమ బాక్సర్‌గా బంగారు పతకం సాధించిందని తెలిపారు. తమ కళాశాల నుంచి రక్షిత, బాజీబాబా, సాయి, కిరీటి, సోనుభార్గవ్, పృథ్వీ తదితరులు కృష్ణా విశ్వవిద్యాలయం పక్షాన త్వరలో చండీగఢ్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మహంతిపురం ఐస్ ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన గుండ్ల హనిమాకు 2013లో ఖమ్మం జిల్లా కొణిజెర్లకు చెందిన వేణుతో ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా అత్త నర్సమ్మ, మామ వెంకన్న, ఆడపడుచు శ్రావణి, ఆమె భర్త వేణుకు లేనిపోని విషయాలను చెప్పి వేధింపులకు గురి చేస్తున్నారు. వాటిని భరించలేక హనిమా పుట్టింటికి వచ్చేసింది. బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బహుజన అధికారులు, ఉద్యోగుల ఫెడరేషన్ ఆవిర్భావం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహుజన సిద్ధాంత- భావజాలాలతో బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) ఆవిర్భవించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఫెడరేషన్ ఆవిర్భావ సభ జరిగింది. సభలో తొలుత 'ప్రతి విద్యార్థి ఇంట భారత రాజ్యాంగం' పుస్తకాల'ను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర కమిటీలు, వివిధ కమిటీలను నియమించారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రజాక్, ఏపీ అధ్యక్షుడిగా ముత్తవల్లి అబ్దుల్ సలార్, కార్యదర్శిగా దేవరకొండ సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ప్రణీత వర్మ తదితరులను నియమించారు. బహుజన రీసెర్చ్ వింగ్, అడ్వైజరీ బోర్డు, సాంస్కృతిక వింగ్, క్రమశిక్షణ కమిటీ, పలు కమిటీలను ప్రకటించారు.

నేడు లక్ష దీపోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్ నారాయణి సేన సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు పిట్టల గోవింద్ ప్రకటనలో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా కార్తికంలో దీపోత్సవం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు ఆదివారం సాయంత్రం 5గంటలలోగా 7794978373 నంబరులో పేర్లు నమోదుచేసుకోవాలని, పాల్గొన్న ప్రతి ఒక్కరికి రుద్రాక్షను ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

క్రీస్తు బోధనలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: క్రీస్తు బోధనలు సదా స్మరణీయమని క్రిస్టియన్ మ్యూజిక్ కాలేజీ విశాఖపట్నం ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ మహర్షి అన్నారు. పోలుకొండ మంగతాయారు స్మారక సాంఘీక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం, డాక్టర్ మహర్షి రచించిన శాస్త్రీయ సంగీత తెలుగు క్రైస్తవ కీర్తనలు గ్రంథావిష్కరణ, పరిచయ సభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ మహర్షి మాట్లాడుతూ ప్రభువైన క్రీస్తు మానవాళికి శాంతి సందేశం అందించినట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్ మాట్లాడుతూ శాంతి దూత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఉమామహేశ్వరి సంస్థ లక్ష్యాలను వివరించారు. యేసయ్య జీవనం-పాపవిమోచనం అంశంగా జరిగిన కార్యక్రమాన్ని పి.కల్యాణి సమన్వయ పరిచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డీజీకే పాల్, బ్రదర్ అనిల్ కుమార్, సిస్టర్ నిర్మల, స్వర్ణదీపిక సంపాదకుడు శివాజీరాజు పాల్గొన్నారు.

మిరపలో సస్య రక్షణ చర్యలు తీసుకోవాలి

గన్నవరం రూరల్: మండలంలో మిరప సాగు చేసే రైతులు వర్షాల వల్ల దెబ్బతిన్న పంట కాపాడుకోవడానికి రక్షణ చర్యలు తీసుకోవాలని మండల హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్ సూచించారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురైందని చెప్పారు. దీని వల్ల మొక్క అవసరమైన పోషకాలను తీసుకోలేదన్నారు. వివిధ దశల్లో సాగు అవుతున్న పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వెద పద్ధతిలో జూలై మాసంలో వేసిన మిరప ప్రస్తుతం కాయ ఏర్పడే దశలో ఉందని, పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపాలని, వాలిన మొక్కలను నిలబెట్టి చుట్టూ మట్టి చేస్తారన్నారు. లీటరు నీటికి 10 గ్రాములు యూరియా కలిపి ఆ ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వడలిపోతే లీటరు నీటికి 5 గ్రాములు మెగ్నీషియన్ సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోతే 10 లీటర్ల నీటికి 50 గ్రాములు అన్న భేదితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ జాగ్రత్తలు రైతులను నష్టపోకుండా కాపాడతాయని వివరించారు.

కుమార్తె అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదుతో శనివారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట మాకిన వారి వీధికి చెందిన లంక రాజ్యలక్ష్మి, శాంతిబాబు దంపతులు. వీరి కుమార్తె స్వాతి గణపతిరావు రోడ్డులోని ఓ హాస్పటల్‌లో నర్సు. ఐదు నెలల క్రితం కోడూరి వెంకటేష్ అనే వ్యక్తితో స్వాతి పెళ్లి నిశ్చయమైంది. డబ్బు సకాలంలో అందకపోవడంతో వివాహం జరగలేదు. వెంకటేష్ మూడు నెలల క్రితం స్వాతి పేరిట బైక్ తీసుకుని వాటి ఈఎంఐలు చెల్లించడం లేదు. దీనిపై వెంకటేష్ తల్లిని అడిగితే మాకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో స్వాతి మానసికంగా కుంగిపోతోంది. శుక్రవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన స్వాతి శనివారం ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.